సాక్షి ఖమ్మం

మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



వన్నె తెచ్చిన క్రీడాకారులు..

ఆర్చరీలో జిల్లాకు పేరు తెచ్చిన క్రీడాకారులు ఉండగా నేటి నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటేలా సిద్ధమవుతున్నారు. 8లో



వేడుకగా జరుపుకునేలా..

నూతన సంవత్సర స్వాగత వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు ఊరువాడా సిద్ధం కాగా కేక్‌లు, స్వీట్ల అమ్మకాలు మొదలయ్యాయి. 9లో

గరిష్టం / కనిష్టం
31° / 18°

వాతావరణం

జిల్లాలో మంగళవారం రోజంతా సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. రాత్రి మాత్రం చలిగాలుల ప్రభావం కనిపిస్తుంది.

వేడుకగా జరుపుకోండి..
శృతి మించొద్దు..


సునీల్‌దత్, పోలీసు కమిషనర్

నేటి రాత్రి 9గంటల నుంచి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

- రాత్రంతా విస్తృతంగా వాహనాల తనిఖీ
- జిల్లాలో 500మంది పోలీసులతో బందోబస్తు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో సీపీ సునీల్‌దత్

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

జిల్లా కేంద్రంతో పాటు అన్ని పట్టణాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూనే ప్రధాన జంక్షన్ల వద్ద మంగళవారం రాత్రి 9గంటల తర్వాత డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తాం. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు తేలితే చర్యలు తప్పవు. ఈవెంట్లు నిర్వహించే వారు కూడా తప్పనిసరి పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలి. అయితే, ఈవెంట్లలో హద్దుమీరి ప్రవర్తిస్తే నిర్వాహకులపైనా కేసులు పెడతాం. రహదారులపై డీజేలు పెట్టి ఇతరులకు ఇబ్బంది కలగజేసే వారిపైనా చర్యలు తీసుకుంటాం.

ఖమ్మంక్రైం: నూతన సంవత్సర వేడుకలను మంగళవారం జిల్లా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. అలాకాకుండా ఇతరులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వేడుకల్లో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా 500మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు వెల్లడించిన సీపీ.. మంగళవారం రాత్రి 9గంటల నుంచే ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అందరూ అర్ధరాత్రి ఒంటి గంట లోగా వేడుకలు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని, అలాకాకుండా అనవసరంగా బయటకు వచ్చినట్లు తేలితే కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. ఈమేరకు సోమవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సీపీ సునీల్ దత్ వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే....

సున్నిత ప్రాంతాల్లో బందోబస్తు

జిల్లాలోని సున్నిత ప్రాంతాలతో పాటు అన్ని ప్రార్థనా మందిరాల వద్ద బందోబస్తు ఉంటుంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు, సినిమా థియేటర్లు, లకారం ట్యాంక్‌బండ్, వెలుగుమట్ల అర్బన్ పార్కు తదితర ప్రాంతాల్లోనూ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తాం. నూతన సంవత్సర వేడుకలు కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి ఇళ్లలోనే జరుపుకోవాలి. అలాకాకుండా రహదారులపై తిరుగుతూ మహిళలను ఇబ్బంది పెట్టొద్దు. వేగంగా వాహనాలు నడుపుతూ కాలనీల్లో తిరిగితే ఇళ్ల వద్ద రంగవల్లులు వేసే మహిళలు ప్రమాదాలకు గురయ్యే అవకాశముంటుంది. ఇక రోడ్లపై కేక్‌లు కట్ చేయడం, డీజేలు పెట్టి నృత్యాలు చేయడం, బాణసంచా కాల్చడం చేస్తే న్యూసెన్స్ కేసులు నమోదు చేస్తాం. ప్రధానంగా తల్లిదండ్రులు మైనర్లు అయిన పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు నెట్టొద్దు.

స్పెషల్, మొబైల్ పార్టీలు

పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ జరిగే వేడుకలు ప్రశాంతంగా ముగియాలన్నదే పోలీసు శాఖ లక్ష్యం. అందుకోసం జిల్లాలో 500మందికి పైగాపోలీసుల తో బందోబస్తు నిర్వహించనున్నాం. అడిషనల్ డీసీపీ స్థాయి మొదలు హోంగార్డుల వరకు బందోబస్తులో పాల్గొంటారు. వీరే కాక స్పెషల్ పార్టీలు, మొబైల్ బృందాలు రాత్రంతా గస్తీ తిరుగుతాయి. ఈ విషయాలను గమనించి జిల్లా వాసులు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలి.

న్యూస్‌రీల్

దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో అందే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆమె మరో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన ఆమె ప్రతీ ఫిర్యాదును పరిశీలించి పరిష్కరించేలా దృష్టి సారించాలని తెలిపారు. డీఆర్వో రాజేశ్వరి, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'ఆపరేషన్ స్మైల్'


వీసీలో పాల్గొన్న అడిషనల్ డీసీపీ, తదితరులు

ఖమ్మంక్రైం: బాల కార్మికులు, తప్పిపోయిన పిల్ల లు, అక్రమ రవాణాకు గురైన చిన్నారులను చిన్నారులను గుర్తించి పునరావాసం కల్పించేందుకు చేపడుతున్న ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేయాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమారాజేశ్వరి సూచించారు. వచ్చేనెల 1నుంచి 31వ తేదీ జరగనున్న 11వ విడత ఆపరేషన్ స్మైల్‌పై హైదరాబాద్ నుంచి ఆమె వీసీ ద్వారా జిల్లా అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈసందర్భంగా డీఐజీ మాట్లాడుతూ రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, ట్రాఫిక్ కూడళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, టీస్టాళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా నుంచి వీసీకి హాజరైన అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్ విజయవంతానికి ఒక్కో డివిజన్‌లో ఒక ఎస్‌ఐ, ఇద్దరు ఏఎస్‌ఐలు, ఇద్దరు కానిస్టేబుళ్లతో బృందాలన ఏర్పాటుచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లు 3,955 మంది

ఖమ్మం సహకారనగర్: వరంగల్–ఖమ్మం–నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా ఓటర్ల లెక్క తేలింది. ఈ మేరకు ఓటర్ల తుది జాబితాను అధికారులు సోమవారం విడుదల చేశారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 24 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయనుండగా, 3,955మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,300 మంది, మహిళలు 1,655మంది ఉన్నారని వెల్లడించారు. కాగా, జిల్లాలోని ఖమ్మం అర్బన్ మండలంలో అత్యధికంగా 1,904 మంది, బోనకల్ మండలంలో తక్కువగా 33 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. కాగా, జాబితాను అన్ని ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాలతో పాటు పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు.

ఇళ్ల సర్వేలో తప్పులు దొర్లొద్దు


వల్లభిలో సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

ముదిగొండ: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల సేకరణకు చేపడుతున్న సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలని డీపీఓ ఆశాలత సూచించారు. ముదిగొండ మండలంలోని వల్లభి, బాణాపురం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను సోమవారం ఆమె పరిశీలించి సిబ్బందికి సూచించారు. దరఖాస్తుదారుల నుంచి అన్ని వివరాలు సేకరించడంతో పొరపాట్లు జరగకుండా యాప్‌లో పొందుపర్చాలని తెలిపారు. ఎంపీఓ వాల్మీకి కిషోర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెరుపులు.. మరకలు


అభివృద్ధి చేసిన మధిర మండలం దెండుకూరులోని జెడ్పీహెచ్‌ఎస్

రివైండ్ 2024

- ఏడాది చివరలో విమర్శలు ఎదుర్కొన్న విద్యాశాఖ
- 'అమ్మ' కమిటీలతో పాఠశాలల అభివృద్ధి
- కొత్త టీచర్ల నియామకం, పదోన్నతులు
- లోపభూయిష్టమైన విధానాలతో ఆఖరుకు అప్రతిష్ట

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో విద్యాశాఖ పనితీరు ఈ ఏడాది తొలినాళ్లలో సాఫీగా సాగగా, చివరకు వచ్చేసరికి అప్రతిష్ట పాలయ్యేలా ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా బడుల్లో అభివృద్ధి జరగగా ప్రభుత్వ పాఠశాలలు కొత్త రూపు సంతరించుకున్నాయి. అలాగే, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకం జరగడంతో కొరత తీరినట్లయింది. అంతేకాక ఏళ్లుగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నట్లుగా పదోన్నతుల ప్రక్రియ సాఫీగా పూర్తి చేశారు. ఇవన్నీ బాగానే ఉన్నప్పటికీ డీఎస్సీ ద్వారా జరిగిన నియామకాల్లో అధికారుల నిర్లక్ష్యంతో కొందరిని తొలగించాల్సి రావడం, పదోన్నతుల విషయంలోనూ అలాగే జరగడంతో మరక పడినట్లయింది.

955 బడుల్లో పనులు

జిల్లాలోని 1,216 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా... సుమారు 75వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. జూన్‌లో చేపట్టిన బడిబాట కార్యక్రమం ద్వారా 10,065మంది విద్యార్థులను చేర్పించారు. అలాగే, పాఠశాల తెరిచిన రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ఇవ్వడం విశేషం. ఇక గతంలో మాదిరి కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టడం, పర్యవేక్షణకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను నియమించారు. ఇందులో భాగంగా 955 పాఠశాలలను ఎంపిక చేయగా రూ.35కోట్లు కేటాయించారు. తొలి దశలో 860పాఠశాలల్లో సుమారు రూ.20కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అంతేకాక 50పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేశారు. కాగా, 2023–2024 విద్యాసంవత్సరానికి పరిశీలిస్తే ఎస్సెస్సీ ఉత్తీర్ణత శాతం 92.24 శాతంగా నమోదైనా గత ఏడాదితో పోలిస్తే తగ్గింది.

534మంది కొత్త టీచర్లు

2024 డీఎస్సీ నియామకాలు సాఫీగా సాగాయి. ఈ ప్రక్రియలో 534మంది ఉపాధ్యాయులు నియమితులయ్యారు. సుమారు 15సంవత్సరాల తర్వాత భారీ స్థాయిలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం ఇదే తొలిసారి. దీంతో చాలా పాఠశాలల్లో టీచర్ల కొరత తీరినట్లయింది. అయితే, హిందీ పండిట్ల నియామకంలో ఏడుగురు అనర్హులని తేల్చి 20రోజుల తర్వాత తొలగించడం గమనార్హం.

బదిలీలు, పదోన్నతులు

జిల్లాలో ఉపాధ్యాయులుగా ఏళ్లుగా బదిలీలు, పదోన్నతుల కోసం ఎదురుచూశారు. వీరికి ఊరట కలిగించేలా ప్రభుత్వం నిర్ణయాన్ని వెలువరించింది. దీంతో 1,034మంది ఎస్‌జీటీలకు ఎస్‌ఏలుగా పదోన్నతి లభించాయి. అలాగే, 1,884మంది ఉపాధ్యాయులను కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేశారు.


డీఎస్సీలో ఎంపికైన యువతికి నియామక పత్రం ఇస్తున్న డీఈఓ (ఫైల్)

అలాగే, స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఏడుగురికి పదోన్నతి కల్పించిన అధికారులు కొన్నాళ్ల తర్వాత వారిలో ఆరుగురిని అనర్హులుగా తేల్చి రివర్షన్ చేయడంతో పర్యవేక్షణలోపంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇది కాక విద్యాశాఖలోని ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి రూ.1.82కోట్ల నిధులను దారి మళ్లించడం చర్చనీయాంశంగా మారింది.

ఇంటర్‌లో..

జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం పాలేరు నియోజకవర్గానికి కొత్తగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. మార్చిలో జరిగిన వార్షిక పరీక్షల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 71.93శాతం, ద్వితీయ సంవత్సరంలో 80.44శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇటీవల ఒక్కో జూనియర్ కళాశాలలో ల్యాబ్‌కు రూ.25వేలు, సీసీ కెమెరాలు, మరమ్మతుల కోసం మరో రూ.6వేలు నిధులు విడుదలవడంతో నిర్వహణ భారం తప్పినట్లయింది.

సర్టిఫికెట్లు తీసుకెళ్లండి

ఖమ్మం సహకారనగర్: సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన భారీ వర్షాలతో జిల్లాలోని పలు ప్రాంతాలను వరద ముంచెత్తగా పలువురు ఎస్సెస్సీ సర్టిఫికెట్లు కోల్పోయారు. బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా విద్యాశాఖ డూప్లికేట్ సర్టిఫికెట్లు జారీ చేసిందని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు దరఖాస్తుదారులు ఒరిజనల్ ఆధార్‌కార్డు, జిరాక్స్‌తో కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

మత్తుగా వీడ్కోలు పలికేలా!


వైరాలో గోదాం వద్ద లారీలో మద్యం లోడ్ చేస్తున్న సిబ్బంది

- ఒకేరోజు వైన్స్, బార్లకు రూ.25కోట్ల విలువైన మద్యం
- ఈ ఏడాది రూ.2,308 కోట్ల సరుకు అమ్మకాలు
- గత ఏడాది పోలిస్తే రూ.60 కోట్లకు పైగా ఎక్కువ

వైరా: మద్యం అమ్మకాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏటా తన రికార్డులను తానే చెరిపేస్తోంది. రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరుగుతుండగా ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం లభిస్తోంది. రెండేళ్ల కాల పరిమితితో వైన్స్ దక్కించుకున్న వ్యాపారులు అమ్మకాల్లో పోటీ పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.2,308 కోట్ల మేర విలువైన మద్యాన్ని వైరాలోని డిపో ద్వారా వ్యాపారులు షాపులకు తరలించగా.. సోమవారం ఒకే రోజు రూ. 25కోట్లకు పైగా విలువైన మద్యాన్ని తీసుకెళ్లడం విశేషం. దీంతో జిల్లాలో పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సర స్వాగత పలుకుతూ మంగళవారం జరిగే సంబురాల్లో మద్యం ఏరులై పారే అవకాశం కనిపిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 210 వైన్స్, 48 బార్లతో పాటు మూడు క్లబ్‌లు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 1 డిసెంబర్ 30వ తేదీ నాటికి ఆయా వైన్స్, బార్లు, క్లబ్‌లకు వైరాలోని ఐఎంఎల్ డిపో నుంచి రూ.2,300 కోట్ల మద్యం తరలించారంటే అమ్మకాలు ఎలా జరిగాయో ఊహించుకోవచ్చు. ఇది గత ఏడాదితో పోలిస్తే రూ.60 కోట్ల మేర ఎక్కువని ఎక్సైజ్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. కాగా, ఈ ఏడాది అమ్ముడైన మద్యంలో 29,063 మద్యం కేసులు, 19లక్షల కేసుల బీర్లు ఉన్నాయి.

బెల్ట్ జోరు

జిల్లాలోని చాలా చోట్ల వైన్స్‌కు సమాంతరంగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. చాలాచోట్ల ఆయా షాపులను వైన్స్ యజమానులే ప్రోత్సహిస్తూ తమ షాపుల నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. దీంతో రాత్రింబవళ్లు అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే తమ ప్రైవేట్ సైన్యం ద్వారా బెదిరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో వైన్స్ యజమానులు లక్ష్యం మేరకు డిపో నుంచి మద్యం తరలిస్తూ అటు వైన్స్, ఇటు బెల్ట్ షాపుల్లో అమ్మకాలు చేపడుతున్నారని తెలుస్తోంది.

ఇంకా పెరిగేవే కానీ...

ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలు ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దుగా ఉన్నాయి. అక్కడ గత ప్రభుత్వం మద్యం అమ్మకాలను నియంత్రించేందుకు పలు చర్యలు చేపట్టింది. దీంతో ఏపీ నుంచి మందుబాబులు సరిహద్దులోని తెలంగాణకు వచ్చి మద్యం సేవించి వెళ్లేవారు. కానీ అక్కడ ఏర్పడిన కొత్త ప్రభుత్వం మద్యం షాపులను బార్లా తెరిచి అన్ని బ్రాండ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో అక్కడి నుంచి తెలంగాణలోకి వచ్చే వారు తగ్గిపోయారు. లేకపోతే ఇక్కడ మద్యం అమ్మకాలు మరింత పెరిగేవని తెలుస్తోంది.

నెల వారీగా డిపో నుంచి తీసుకెళ్లిన మద్యం విలువ

నెల	విలువ (రూ.కోట్లలో)
జనవరి	221
ఫిబ్రవరి	210
మార్చి	206
ఏప్రిల్	181
మే	237
జూన్	210
జూలై	180
ఆగస్టు	196
సెప్టెంబర్	185
అక్టోబర్	152
నవంబర్	135
డిసెంబర్ (30వ తేదీ నాటికి)	195
మొత్తం	2,308

శిల్పారామం తరహాలో 'వెలుగుమట్ల'

- అదేస్థాయిలో ఖిలాను తీర్చిదిద్దుతాం...
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన నాయకులు

ఖమ్మంఅర్బన్: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది శిల్పారామం తరహాలో వెలుగుమట్ల పార్క్‌ను అభివృద్ధి చేయడమే కాక జూ పార్క్ ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఇక ఖమ్మం ఖిలాపై రోప్ వే అందుబాటులోకి రానుందని తెలిపారు. గడిచిన ఏడాది కాలంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన అభివృద్ధిలో దూసుకెళ్తున్నామని మంత్రి చెప్పారు. ఖమ్మంలోని పుట్టకోటలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రిగా తాను ఏ శాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్నా ఉమ్మడి జిల్లాలోని సమస్యల పరిష్కారమే ధ్యేయమని తెలిపారు. ఖమ్మం నియోజకవర్గంలో అధికారుల మార్పిడి, వరదల కారణంగా కొంత కాలం ఇబ్బందులు వచ్చినా ఇప్పుడు అభివృద్ధి పనులు వడివడిగా సాగుతున్నాయని చెప్పారు.

ఎకో పార్క్‌గా అభివృద్ధి

ఖమ్మంలోని 500 ఎకరాల్లో విస్తరించిన ఉన్న వెలుగుమట్ల అటవీ పార్క్‌ను శిల్పారామం మాదిరి ఎకో పార్క్‌గా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇక్కడ జూ పార్క్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఖిల్లాపై రోప్ వే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పనులన్నీ కొత్త ఏడాదిలో పూర్తిచేయాలన్నది లక్ష్యమని తెలిపారు. ఇక రూ.700 కోట్లతో మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, ఖమ్మంలో రూ.220 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అంతేకాక రఘునాథపాలెం బైపాస్‌లో మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణం, మండల కేంద్రంలో స్వామి నారాయణ్ ట్రస్ట్ ద్వారా స్కూల్ నిర్మాణం, అక్కడే ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. నగరం చుట్టూ జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుండడంతో ఖమ్మంకు రింగ్ రోడ్డు ఏర్పడేలా ప్రణాళిక రూపొందించామని మంత్రి చెప్పారు. ఇక గోదావరి జలాలను పది నియోజకవర్గాలకు తీసుకురావడం తన లక్ష్యం కాగా, వచ్చే స్వాతంత్ర్య దినోత్సవం నాటికి యాతాలకుంట టన్నెల్ పూర్తి చేస్తామని తుమ్మల వివరించారు. అలాగే, పాండురంగాపురం నుండి భద్రాచలం వరకు రైల్వేలైన్, కొత్తగూడెంలో ఎయిర్ పోర్ట్, మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని తెలిపారు. ఈసమావేశంలో కార్పొరేటర్ కమర్తపు మురళి, వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఏఎస్‌ఆర్‌బీలో ఐదో ర్యాంకు

- జాతీయస్థాయిలో సత్తా చాటిన సుబ్లేడు వాసి లత
- 'ఐకార్'లో శాస్త్రవేత్తగా అవకాశం


కుటుంబ సభ్యులతో పోలెపొంగు లత

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు గ్రామానికి చెందిన పోలెపొంగు లత అగ్రికల్చర్ సైంటిస్ట్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఏఎస్ఆర్‌బీ) ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షలో జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ఈమేరకు ప్లాంట్ పాథాలజీ (మొక్కల వ్యాధి అధ్యయన శాస్త్రం) విభాగం ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియా ఐదో ర్యాంకు సాధించడం ద్వారా జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐకార్)లో శాస్త్రవేత్తగా అవకాశం దక్కించుకుంది. సుబ్లేడుకు చెందిన పోలెపొంగు జగ్గయ్య – కృష్ణకుమారికి కుమార్తె లతతో పాటు కుమారుడు లక్ష్మణరావు ఉన్నారు. లత సుబ్లేడులోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి వరకు, ఐదు నుండి 10వ తరగతి వరకు వైరా ఎస్సీ బాలికల హాస్టల్‌లో చదివింది. ఆతర్వాత ఇంటర్ విజయవాడలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో, బీఎస్సీ అశ్వారావుపేటలోని అగ్రికల్చర్ కాలేజీలో, ఎమ్మెస్సీ(ప్లాంట్ పాథాలజీ) మహారాష్ట్రలో పూర్తిచేశాక హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంది. ఆపై అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికై తాను బీఎస్సీ చదివిన అశ్వారావుపేటలోని అగ్రికల్చర్ కాలేజీలోనే పాఠాలు బోధిస్తోంది.

తొలి ప్రయత్నంలోనే...

ఓ పక్క అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తూనే లత అగ్రికల్చర్ సైంటిస్ట్ రిక్రూట్మెంట్ బోర్డ్(ఏఎస్ఆర్‌బీ) నిర్వహించే పరీక్షకు సిద్ధమైంది. ఈమేరకు తొలి ప్రయత్నంలో జాతీయ స్థాయిలో ఐదో ర్యాంకు సాధించింది. తద్వారా మొక్కలపై పరిశోధన కోసం శాస్త్రవేత్తగా ఎంపికవాలనే తన లక్ష్యాన్ని నెరవేర్చుకుంది. వచ్చే నెలలో ఐకార్‌లో శాస్త్రవేత్తగా ఆమెకు పోస్టింగ్ వచ్చే అవకాశముందని తెలిసింది. ఈ సందర్భంగా మొక్కల వ్యాధి నివారణ, తక్కువ ఖర్చుతో రసాయన, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి అధిక, ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించేలా పరిశోధనలు చేయాలన్నదే తన లక్ష్యమని లత వెల్లడించింది.

క్లుప్తంగా

టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర కార్యదర్శుల నియామకం



రాష్ట్ర కార్యదర్శులుగా ఎన్నికైన యూనియన్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్(టీఎస్ సీపీఎస్ ఈయూ) రాష్ట్ర కార్యదర్శులుగా జిల్లా నుంచి నలుగురికి అవకాశం దక్కిందని ఖమ్మం జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన సమావేశంలో భాగంగా ఖమ్మం జిల్లాకు చెందిన యరమల శ్రీనివాసరెడ్డి, రాగి సురేష్, షేక్ మోబిన్ అహ్మద్, ముత్యాల లక్ష్మాచారిని రాష్ట్ర కార్యదర్శులుగా నియమించారని వెల్లడించారు. ఈ సందర్భంగా వారిని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శశిధర్, చర్ల శ్రీనివాసరావుతో పాటు మోహన్, శ్వేత, తదితరులు అభినందించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెలో మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి, పక్కన గుండాల కృష్ణ తదితరులు

ఖమ్మం సహకారనగర్: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సర్వీస్ క్రమబద్ధీకరణతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె సోమవారం 20వ రోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని బీఆర్ఎస్ నాయకులు రాకేష్‌రెడ్డి, గుండాల కృష్ణ సోమవారం సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగ సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శివాలయం హుండీ ఆదాయం రూ.52వేలు

కూసుమంచి: కూసుమంచిలోని పురాతన గణపేశ్వరాలయం(శివాలయం) హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారంలెక్కించారు. ఈసందర్భంగా 45 రోజులకు రూ.52,695 ఆదాయం సమకూరిందని దేవాదాయశాఖ ఖమ్మం డివిజన్ పరిశీలకులు అనిల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ కాముని శ్రీకాంత్, మాజీ సర్పంచ్ చెన్నా మోహన్‌తో పాటు రేలా ప్రదీప్‌రెడ్డి, కందుల వీరబాబు, రెడ్యానాయక్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, కూసుమంచిలోని శివాలయం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం ఏర్పాటు చేసినట్లు ఈఓ శ్రీకాంత్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించాక చైర్మన్ ఎన్నిక ఉంటుందని వెల్లడించారు.

సర్వే, అభివృద్ధి పనులపై సమీక్ష



చింతగుర్తిలో ఆయిల్‌ఫామ్ క్షేత్రంలో పరిశీలిస్తున్న సీఈఓ దీక్ష

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే, అభివృద్ధి పనులపై జెడ్పీ సీఈఓ దీక్షారైనా సోమవారం సమీక్షించారు. ఈసందర్భంగా మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఆమె అధికారులతో సమావేశమయ్యారు. మండలంలో ఇప్పటివరకు జరిగిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే, యాప్‌లో నమోదుపై ఆరా తీయడమే కాక ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యాన జరుగుతున్న అభివృద్ధి పనులు, బిల్లులు చెల్లింపు వివరాలు తెలుసుకున్నారు. అలాగే, రుణమాఫీపై నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని చింతగుర్తిలో ఆయిల్‌పామ్ క్షేత్రాలు, తహసీల్ ఎదుట స్త్రీ శక్తి టీ సెంటర్‌ను సీఈఓ పరిశీలించారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ విల్సన్, ఏఈ చిరంజీవి, ఏఓ ఉమామహేశ్వరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

చింతకాని: మండలంలోని నర్సింహాపురానికి చెందిన బుర్రి లక్ష్మణుడు(21) ఈనెల 26న పురుగుల మందు తాగగా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఘటనపై ఆయన తండ్రి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

వన్నె తెచ్చిన క్రీడాకారులు ఎందరో..

- ఆర్చరీలో జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎంపిక
- నేటి నుంచి ఖమ్మంలో రాష్ట్రస్థాయి సీఎం కప్ ఆర్చరీ పోటీలు
- హాజరు కానున్న 180 మంది క్రీడాకారులు



ఆర్చరీ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు (ఫైల్)

ఖమ్మం స్పోర్ట్స్: ఒకప్పుడు ఆదివాసీ, గిరిజన గ్రామాలకే పరిమితమైన విలు విద్య(ఆర్చరీ) ఇప్పుడు ఎందరో క్రీడాకారులను వెలుగులోకి తీసుకొస్తోంది. ఉమ్మడి జిల్లాలో నాలుగు దశాబ్దాలుగా పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. ఏజెన్సీ ప్రాంత వాసుల్లో సహజసిద్ధంగా ఆర్చరీలో ఉండే ప్రతిభ వారిని పోటీలకు ఎంపికయ్యేలా చేసింది. 1988 నుంచే ఉమ్మడి జిల్లాకు చెందిన మిడియం బొజ్జి, శ్యాంసుందర్, గొంది మారెప్ప, కారెం శివశంకర్, దుర్గయ్య తదితరులు అంతర్జాతీయస్థాయి ఆర్చరీ టోర్నీలకు ప్రాతినిధ్యం వహించారు. ఈక్రమాన తొలిసారిగా ఖమ్మంలో సీఎం కప్ ఆర్చరీ పోటీలు మంగళవారం నుంచి మొదలవుతున్న సందర్భంగా కథనం.

ఖేలో ఇండియా సెంటర్లు

ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, పాల్వంచల్లో ఖేలో ఇండియా ఆర్చరీ సెంటర్లు ఉన్నాయి. అంతేకాక దమ్మపేట పాల్వంచ, కాచినపల్లిలోని ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ కేంద్రాలు సైతం ఏర్పాటుచేశారు. జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఆల్ఇండియా యూనివర్సిటీ టోర్నీలో స్వర్ణపతకాలు సాధించారు. జాతీయస్థాయి పోటీల్లో సీనియర్ క్రీడాకారులు 50మందికి పైగా సత్తాచాటగా.. దాదాపు 2వేల మంది క్రీడాకారులు వివిధ పోటీలకు ప్రాతినిధ్య వహించారు. ఇక్కడ ఆర్చరీ క్రీడకు ఉన్న ప్రాధాన్యత, క్రీడాకారుల్లో ఆసక్తిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీల నిర్వహణ బాధ్యతలు కేటాయించారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మంగళ, బుధవారం ఇండియాన్, రికర్వ్, కాంపౌండ్ రౌండ్లలో జరిగే ఆర్చరీ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.



స్టేడియంలో పేర్లు నమోదు చేసుకుంటున్న క్రీడాకారులు

చేరకున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడల్లో భాగంగా మంగళవారం నుంచి ఆర్చరీ రాష్ట్ర స్థాయి పోటీలు మొదలుకానున్నాయి. పురుషుల, మహిళలకు వేర్వేరుగా జరిగే పోటీలకు 180మంది హాజరుకానుండగా నిర్వహణను జిల్లా యువజన క్రీడల శాఖ పర్యవేక్షిస్తోంది. ఇందుకోసం క్రీడాకారులు పలువురు సోమవారం సాయంత్రమే చేరుకుని పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య, కోచ్‌లు ఎం.డీ.అక్బర్ అలీ, గొంది మారెప్ప, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలోనే అంతర్జాతీయ స్థాయికి...



జిల్లా నుంచి తొలిసారిగా అంతర్జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహించింది ఆర్చరీ క్రీడాకారులే. ఈ క్రీడకు పూర్వవైభవం తీసుకురావడానికి రాష్ట్ర స్థాయి పోటీలు ఉపకరిస్తాయి. క్రీడాకారులు అన్ని పోటీల్లో రాణించేలా తీర్చిదిద్దాలన్నదే మా లక్ష్యం.

– పుట్టా శంకరయ్య, ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి

టోర్నీ సమర్థవంతంగా నిర్వహిస్తాం



ఆర్చరీ టోర్నీ పకడ్బందీగా జరిగేలా ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే క్రీడాకారులు చేరుకుని సాధనలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఆర్చరీకి ఉన్న ప్రాధాన్యతను స్పోర్ట్స్ అథారిటీ గుర్తించింది. అందుకే రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణ బాధ్యతలు అప్పగించింది.

– టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీవైఎస్ఓ ఖమ్మం

క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యం



ఆర్చరీలో సహజసిద్ధమైన ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీసి అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పుడు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలు ఇక్కడ నిర్వహిస్తుండడంతో మరికొందరు ఔత్సాహికులు వెలుగు చూసే అవకాశముంది.

– సాదుల సారంగపాణి, ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

గుర్రాలపాడులో భూమాయ

రూ.కోటి విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించిన రియల్టర్

ఖమ్మంరూరల్: జిల్లా కేంద్రానికి ఆనుకున్న ఉన్న రూరల్ మండలంలో భూముల ధర రూ.కోట్లు దాటుతుండడంతో రియల్టర్లు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలోనే గుర్రాలపాడు పరిధి 51, 52 సర్వేనంబర్లలో ఓ రియల్టర్ కొంత భూమిని కొనుగోలు చేసి వెంచర్ వేసి ప్లాట్లు చేశాడు. ఇందుకోసం నామమాత్రంగా అనుమతులు తీసుకున్నట్లు తెలిసింది. ఇంతవరకు బాగానే ఉన్నా ఆయన కొనుగోలు చేసిన భూమి పక్కనే దశాబ్దాలుగా పరిసర ప్రాంత రైతుల పొలాలకు వెళ్లడానికి ఉన్న ఆరున్నర గుంటల ప్రభుత్వ డొంకను సైతం ఆక్రమించి తన వెంచర్‌లో కలిపేసుకున్నాడు. ఈ భూమి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.కోటి మేర ఉంటుంది.

ఇంకో భూమి ఇచ్చాడట...

భూకబ్జా విషయం గతంలోనే అప్పటి ఆర్‌డీఓ దృష్టికి వెళ్లగా తక్షణమే భూమిని స్వాధీనం చేసుకోవాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కానీ ఇప్పటివరకు అది జరగలేదు. ఈ విషయమై రూరల్ తహసీల్దార్ పి.రాంప్రసాద్‌ను వివరణ కోరగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన మాట వాస్తవమేనని తెలిపారు. సదరు రియల్టర్ డొంక భూమికి బదులు పక్కనే ఉన్న తన వెంచర్‌లోని భూమి ఇచ్చారని వెల్లడించారు. అయినప్పటికీ ప్రభుత్వ డొంక భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

భూభారతితో సమస్యలన్నీ పరిష్కారం కావు



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రప్రభుత్వం తీసుకొస్తున్న భూభారతి చట్టం కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన ధరణి కంటే మెరుగ్గా ఉండొచ్చు కానీ భూసమస్యలన్నీ పరిష్కారం కావని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సమగ్ర భూ సర్వే మాత్రమే సమస్యలుకు పరిష్కారం చూపిస్తుందని తెలిపారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో భూముల సమగ్రసర్వే నిజాం కాలంలో జరగగా, ఆతర్వాత అనేక మంది చేతులు మారినందున సమగ్ర సర్వే ద్వారా హద్దులు నిర్ణయించి ప్రతి కమతానికీ భూధార్ నంబర్, పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేయాలని కోరారు. అలాగే, కౌలు రైతుల గుర్తింపు కూడా చేయాలన్నారు. ఇక కాలయాపన చేయకుండా రైతు భరోసా తక్షణమే విడుదల చేయాలని రాంబాబు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్, నాయకులు తాతా భాస్కర్‌రావు, వాసిరెడ్డి ప్రసాద్, దుగ్గి కృష్ణ, చింతనిప్పు చలపతిరావు, రచ్చా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య వివాదం

కొణిజర్ల: కొణిజర్ల సమీపంలోని గ్రీన్‌ల్యాండ్ ఇండో ఖతార్ వెంచర్‌కు సంబంధించి భాగస్వాముల మధ్య విబేధాలు తలెత్తి గొడవకు దారి తీసినట్లు సమాచారం. వెంచర్‌లోని భాగస్వామి కిషోర్ ఆదివారం తనపై ఇండోఖతార్ సిబ్బంది దౌర్జన్యానికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం మరో బాగస్వామి గిరి తన కార్యాలయం నుంచి సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లను కిషోర్, శరత్, రాము ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ జి.సూరజ్ తెలిపారు. కాగా, సోమవారం మధ్యాహ్నం కిషోర్, శరత్, రాము తదితరులు గ్రీన్‌ల్యాండ్ కార్యాలయానికి రాగా వారికి ఇండో ఖతార్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడగా ఎస్ఐ సిబ్బందితో చేరుకుని భాగస్వాములు తప్ప మిగతా వారిని బయటకు పంపించారు.

మెప్మా ఆర్పీల వేతనాల చెల్లింపునకు చర్యలు

ఖమ్మంమయూరిసెంటర్: మెప్మా ఆర్పీలకు గౌరవ వేతనాల చెల్లింపుపై సీడీఎంఏ కీలక ఆదేశాలు జారీ చేసింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఆర్పీల వేతనాలను ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ కమిషనర్లు చెల్లించాలని, ఆపై మెప్మా ద్వారా నిధులు విడుదల చేస్తామని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కేఎంసీ పరిధిలోని ఆర్పీల వేతనాలను చెల్లించేందుకు అధికారులు వారి హాజరు, ఇతర వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం ఏడు నెలల వేతనాలకు సంబంధించి కమిషనర్‌కు నివేదిక ఇవ్వనుండగా నిధులు విడుదల చేసే అవకాశముంది. అయితే, రీయింబర్స్‌మెంట్ విధానంలో వేతనాలు చెల్లించాక, ప్రభుత్వం నుంచి నిధుల విడుదలలో ఆలస్యం జరిగితే మున్సిపాలిటీలపై భారం పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

పోలీసుల అదుపులో బైక్ దొంగలు?

నేలకొండపల్లి: వివిధ ప్రాంతాల్లో బైక్ చోరీలు చేసిన నిందితులను పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. మండలంలోని ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకుడు వివిధ గ్రామాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి విక్రయిస్తున్నట్లు బయటపడడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమచారం. ఇటీవల మహబూబ్‌నగర్ నుంచి గొర్రెల మందతో వచ్చిన ఓ వ్యక్తికి చెందిన బైక్ చోరీ కాగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారిస్తుండగా వ్యవహారం బయటపడినట్లు తెలిసింది. ఈ విషయమై వారిని విచారిస్తూ కొన్ని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే, నేలకొండపల్లి ఎస్సై పి.సంతోష్‌ను వివరణ కోరగా వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

ద్విచక్రవాహనం చోరీ

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో బైక్ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రాసాల నాగరాజు పొలం వద్ద బైక్ పెట్టి పొలం పనులు చేసుకుని వచ్చేలోగా వాహనం కనిపించడం లేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై పి.సంతోష్ తెలిపారు.

రోడ్డు వివాదంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

దౌర్జన్యం చేశారని బాధితుడి వీడియో



చికిత్స పొందుతున్న శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లి: సీసీ రోడ్డు నిర్మాణం వివాదం చినికిచినికి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి దారితీసింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి మండలం రేజర్లలో ఎస్‌డీఎఫ్ నిధుల కింద పంచాయతీరాజ్ రోడ్డు నుంచి భీమిరెడ్డి అరుణ నివాసం వరకు 90 మీటర్ల మేర రూ.5 లక్షలతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టింది. గతంలో ఈ రోడ్డు పంచాయతీ ఆధీనంలోనే ఉండగా పలుమార్లు గ్రావెల్ తోలించామని, ఇప్పుడు పంచాయతీ తీర్మానంతోనే రోడ్డు వేస్తున్నామని ఎంపీఓ కృష్ణ వెల్లడించారు. ఇక వివాదం నెలకొన్న మేర రోడ్డు పనులను నిలిపివేస్తున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ సాయికృష్ణ వెల్లడించారు. ఇదంతా బాగానే ఉన్నా కుటుంబం వాటాలు పంచుకున్నప్పుడు తనకు వచ్చిన వాటా నుంచి దారి తీసుకోగా, దీనికి పంచాయతీకి సంబంధం లేదని కనమతరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం అధికారులతో వాగ్వాదానికి దిగాడు. ఈ అంశంపై కోర్టులో కేసు ఉందని చెబుతూ పనులను అడ్డుకోవడంతో ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సత్తుపల్లి పోలీసులు చేరుకుని కోర్టు ఆర్డర్ కాపీలపై ఆరా తీశారు. అయితే, ఆ కాపీలు గతంలో పంచాయతీ అధికారులకు గతంలో ఇచ్చానని, ఇప్పుడు లాయర్ వద్ద ఉన్నాయని శ్రీనివాసరెడ్డి బదులిచ్చారు. ఈక్రమాన ఆయనను పోలీసులు అక్కడ నుంచి పంపిస్తుండగా ఇంట్లోకి వెళ్లి పురుగుల మందు తాగినట్లు తెలిసింది. దీంతో శ్రీనివాసరెడ్డిని సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంకు తరలించారు. కాగా, తన భూమిలో దౌర్జన్యంగా రోడ్డు వేస్తున్నారని, సుబ్బారెడ్డి, ఖలీల్, సుధాకర్, భాస్కర్‌రెడ్డి కలిసి రోడ్డు వేయగా ఎస్సై కూడా దౌర్జన్యం చేశారని కనమతరెడ్డి శ్రీనివాసరెడ్డి రికార్డు చేసిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అంశంపై భీమిరెడ్డి సుబ్బారెడ్డి స్పందిస్తూ తాను హైదరాబాద్ వెళ్లి మూడు రోజులైందని, వివాదానికి సంబంధం లేకపోగా భూమి పంచాయతీదేనని తెలిపాడు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తల్లాడ: తల్లాడ మండలం అంబేడ్కర్‌నగర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి వైపు వెళ్తున్న కారును అశ్వారావుపేట మండలం తిరుమలకుంట వెళ్తున్న కారును తల్లాడ నుంచి వైరా వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తిరుమలకుంటకు చెందిన కె.నాగేశ్వరరావు, హైదరాబాద్‌కు చెందిన కారు డ్రైవర్ కె.రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

కారు బోల్తా పడిన ఘటనలో...

సత్తుపల్లిటౌన్: అదుపు తప్పిన కారు పల్టీ కొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌కు చెందిన పృథ్వీ, శివ, రణదీప్ వైజాగ్ వెళ్లి సోమవారం తిరిగి వస్తున్నారు. ఈక్రమాన సత్తుపల్లిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వెళ్తున్న లారీని తప్పించే క్రమాన కారు అదుపు తప్పి బోల్తా పడగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.



అంబేడ్కర్ నగర్ వద్ద కారును ఢీకొట్టిన లారీ

ట్రాఫిక్‌కు అంతరాయం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కిష్టారం వై-జంక్షన్ వద్ద సోమవారం రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో వాహనాల ముందు భాగాలు దెబ్బతినగా డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా, ఈ ఘటనతో రెండు వైపులా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు.

మామ మందలించాడని.. వేడి నూనె పోసిన కోడలు

తీవ్రగాయాలతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స

కారేపల్లి: అస్తమానం బయట తిరగొద్దని మందలించిన మామపై కోపం పెంచుకున్న కోడలు ఆయన నిద్రిస్తున్న వేళ వేడి నూనె పోయడంతో తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతున్నాడు. కారేపల్లి మండలం ఫైల్‌తండాలో చోటుచేసుకున్న ఘటన వివరాలిలా ఉన్నాయి. ఫైల్‌తండాకు చెందిన అజ్మీరా బాబు(60) కుమారుడు కోవిడ్ సమయాన మృతి చెందాడు. అప్పటి నుంచి ఆయన, కోడలు ఉమ, కుటుంబ సభ్యులు ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల ఉమ తరచుగా బయట తిరుగుతుండడంతో అది సరికాదని బాబు మందలించాడు. దీంతో కక్ష పెంచుకున్న ఆమె ఈనెల 28వ తేదీ రాత్రి బాబు నిద్రలో ఉన్న సమయాన వంట నూనె వేడి చేసి ఆయనపై పోసింది. ఈమేరకు ఆయన కేకలు వేయగా చుట్టుపక్కల వారు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

చనిపోయాడని ఫిర్యాదు

తీవ్రగాయాల పాలైన బాబు వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతుండగా ఆయన మృతి చెందినట్లు అల్లుడు కారేపల్లి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ ఘటన వెలుగు చూడగా సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి సిబ్బందిని వరంగల్ పంపించారు. అక్కడ ఆస్పత్రిలో ఆరా తీయగా బాబు మృతదేహం ఆచూకీ లేకపోవడంతో వైద్యులను సంప్రదిస్తే ఆయన చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఈమేరకు తప్పుడు సమాచారం ఇచ్చిన బాబు అల్లుడిని మందలించిన పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి దిగువ కోర్టు విధించిన శిక్షనే ఖరారు చేస్తూ ఖమ్మం కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి అర్చనా కుమారి సోమవారం తీర్పు వెలువరించారు. ఏన్కూరుకు చెందిన అరవపల్లి వెంకటేశ్వర్లు తల్లాడకు చెందిన బండారు విశ్వనాథం వద్ద 2013 ఫిబ్రవరి 15న రూ.7లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి ఈ ఏడాది ఆగస్టు 11న రూ.9.50 లక్షలకు చెక్కు జారీ చేశాడు. అయితే, ఆ చెక్కును బ్యాంకు జమ చేస్తే బ్యాలెన్స్ లేకపోవడంతో నిరాదరణకు గురైంది. దీంతో విశ్వనాథం ఆబ్కారీ కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయగా వెంకటేశ్వర్లుకు ఆరు నెలల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శాంతిలత తీర్పు వెలువరించారు. ఈ తీర్పుపై నిందితుడు పైకోర్టులో అప్పీలు చేయగా వాదనలు విన్న న్యాయమూర్తి దిగువ కోర్టు విధించిన శిక్షనే ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో వృద్ధుడి మృతదేహం



మృతదేహాన్ని తరలిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

చింతకాని: చింతకాని రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడి(50) మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్‌పీ ఎస్సై పి.భాస్కర్‌రావు తెలిపారు. సదరు వృద్ధుడు కొన్నాళ్లుగా రైల్వేస్టేషన్ సమీపంలో భిక్షాటన చేస్తూ స్టేషన్‌లోని పాత భవనంలో ఉంటున్నాడు. ఆయన సోమవారం మృతి చెందగా అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రూ.1.12కోట్ల గంజాయి దహనం

ఖమ్మంక్రైం: భద్రాచలం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 449కేజీల గంజాయిని సోమవారం దహనం చేసినట్లు ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. కొద్దినెలలుగా 24కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఈ గంజాయి విలువ రూ.1.12 కోట్లుగా ఉంటుందని వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఖమ్మం సమీపాన గంజాయిని దహనం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గణేష్, భద్రాచలం ఎక్సైజ్ సీఐ రసూల్ ఉన్నిసాబేగం పాల్గొన్నారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్ట్

ఖమ్మంఅర్బన్: గంజాయి కలిగి ఉండడమే కాక సేవిస్తూ పట్టుబడిన నలుగురిని ఆదివారం అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. ఖమ్మం గోపాలపురం సమీపంలోని ఓ ఇంట్లో కొందరు గంజాయి తాగుతుండడమే కాక ఇతరులకు అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. అక్కడ ఎనిమిది మంది ఉండగా వారి వద్ద సుమారు 975 గ్రాముల గంజాయి లభించింది. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా గండమాల మధు, వెలిశాల శ్రీనాథ్‌లు బైక్‌పై ఏపీ రాష్ట్రానికి వెళ్లి నాలుగు కేజీల గంజాయి తీసుకొచ్చినట్లు తేలింది. ఆ గంజాయిని వారు చిన్న ప్యాకెట్లుగా మార్చి అధిక ధరకు అమ్ముతున్నారని గుర్తించారు. దీంతో మధు, శ్రీనాథ్‌తో పాటు నరేందర్, కల్యాణ్‌ను అరెస్ట్ చేయగా గంజాయి తాగుతున్న మరో నలుగురుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లైంగికదాడి కేసులో వ్యక్తి...

రఘునాథపాలెం: మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన కేసులో కారు డ్రైవర్ హిమామ్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లడమే కాక లైంగికదాడికి పాల్పడగా కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని వెల్లడించారు.

కేసు నమోదు

కల్లూరు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వివాహిత మహిళపై కోరిక తీర్చాలంటూ అసభ్యకరంగా ప్రవర్తించిన ఎలగాల గోపి, తోడేటి సురేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వంద క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

తిరుమలాయపాలెం: మండలంలోని అజ్మీరా తండా గ్రామ పరిధి బొర్సగడ్డ తండాలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని ఎస్ఐ జగదీష్ ఆధ్వర్యాన సోమవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని మూడు ఇళ్లలో అక్రమంగా బియ్యం నిల్వ చేసి ఇతర ప్రాంతాలకు తరలించే యత్నాల్లో ఉన్నారనే సమాచారంతో తనిఖీలు చేపటట్టారు. ఈ సందర్భంగా 200 బస్తాల్లో నిల్వ చేసి వంద క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి ఖమ్మంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించడమే కాక పిండిప్రోలుకు చెందిన మడికంటి శంకర్, మడికంటి రామకృష్ణ, బొర్సగడ్డతండాకు చెందిన బోడ సురేష్, నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.